నిందితులకు ఉరిశిక్ష విధించాలి


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన కాలనీ మహిళలు

మైలార్‌దేవ్‌పల్లి: కోల్‌కత్తాలో డాక్టర్‌పై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితులకు ఉరిశిక్ష విధించాలని మధుబన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యురాలు వజ్రమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి కాలనీలో మహిళలతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోల్‌కత్తా ప్రభుత్వం వెంటనే నిందితుడికి ఉరిశిక్ష వేధించి న్యాయం చేయాలని కోరారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారికి కోర్టులు కఠిన శిక్షలు అమలు చేయాలని, దేశంలో మహిళల కోసం నూతన చట్టాలను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శైలజ, స్వరూపా, భారతి కాలనీలోని మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లిపల్లి నరేందర్

శంషాబాద్: పట్టణంలోని సాతంరాయి రెండో వార్డులో జరుగుతున్న డ్రైయినేజీ పనులను పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ సోమవారం పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేస్తున్నారు. ప్రధానంగా బలహీన వర్గాల కాలనీలో సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. డ్రైయినేజీ పనులు పారదర్శకంగా నాణ్యతతో చేపట్టాలని ఆయన నిర్వాహకులకు సూచించారు.

చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి: డీసీపీ

శంషాబాద్ రూరల్: వినాయక చవితి ఉత్సవాలను, మండపాల ఏర్పాటు, నిమజ్జనం సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రతలపై నిర్వాహకులు, గ్రామస్తులకు సోమవారం మండలంలోని పెద్దషాపూర్ వద్ద ఉన్న ఫంక్షన్‌హాలులో సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్సవాల సయమంలో సంయమనం పాటిస్తూ ప్రశాంతంగా జరుపుకోవాలని డీసీపీ సూచించారు. మండలపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు ఎం.భాస్కర్ రావు, నర్సింహారావు, జి.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే నంబర్‌తో రెండు ఆటోలు


ఒకే నెంబర్‌పై రెండు ఆటోలు

మైలార్‌దేవ్‌పల్లి: ఒకే రిజిస్ట్రేషన్ నెంబర్‌పై రెండు ఆటోలు తిరుగుతుండగా ట్రాఫిక్ పోలీసులు ఆటోలను పట్టుకున్నారు. సోమవారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ స్వామి దుర్గానగర్ చౌరస్తాలో విధులు నిర్వహిస్తుండగా రెండు ఆటోలకు ఒకే నెంబరు కనబడడంతో వెంబడించి ఆ ఆటోలను పట్టుకొన్నారు. ఇద్దరు ఆటో డ్రైవర్లను విచారించగా అందులో ఒక ఆటోకు వరిజినల్ నంబర్ ఉండగా, మరొకటి అదే నెంబర్‌ను పెట్టుకొని తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ఆటోలను, డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్ జిమ్‌కు పతకాల పంట


పతకాలు సాధించిన మాస్టర్ జిమ్స్ యువకులు



బంగారు పతకం సాధించిన మాస్టర్ జిమ్ యువకుడు

శంషాబాద్: మిస్టర్ తెలంగాణ వ్యాయామ పోటీల్లో శంషాబాద్ పట్టణానికి చెందిన మాస్టర్ జిమ్స్, హెల్త్‌క్లబ్ అత్యధిక పతకాలు సాధించింది. అల్వాల్‌లోని రాయల్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ పోటీల్లో మాస్టర్స్ జిమ్ నుంచి మొత్తం పదకొండు మంది పాల్గొనగా ఎనిమిది మందికి వివిధ కేటగిరిల్లో బంగారు పతకాలు రాగా, ఒకరికి రజత పతకం వచ్చిందని జిమ్‌కోచ్ నజ్ముద్దిన్ తెలిపారు. యువత వ్యసనాల బారిన పడకుండా వ్యాయామంపై దృష్టిసారించాలని ఆయన తెలిపారు. పతకాలు సాధించిన వారిలో పవన్, మహ్మద్, మహేష్‌చారి, భరత్‌యాదవ్, నిఖిల్, సాల్మన్, ఫైజన్, ముమ్‌తాజ్ తదితరులున్నారు.

ముకుందా.. ముకుందా

విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న అశోక్‌యాదవ్, ఉషారాణిలు



కృష్ణుడు, రాధిక వేషధారణల్లో చిన్నారులు








గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాల, శివరాంపల్లి పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలతో పలువురిని విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు కృష్ణుడు 35 మంది, గోపికలు 40 మంది వేషధారణలతో ప్రదర్శన నిర్వహించారు. బాలికలు రాధాకృష్ణ పాటలతో నృత్య ప్రదర్శనలు, కోలాట ప్రదర్శనలు, బాలురు చెక్క భజన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అత్తాపూర్, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లోనూ శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ చిన్నారులను శ్రీకృష్ణుడిగా, గోపికల వేషధారణలో అందంగా ముస్తాబు చేశారు. బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని కాళీమందిర్ ఎస్ఎస్‌వీ హై స్కూల్‌లో విద్యార్థుల చేత ఉట్టి కొట్టించే కార్యక్రమాలు, సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

– రాజేంద్రనగర్ బృందం





శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణల్లో చిన్నారులు, చిన్నారి












అలకాపూర్ టౌన్ షిప్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు


ఖానాపూర్‌లో చిన్ని కృష్ణుడి వేషధారణలో బాలుడు


ఖానాపూర్‌లో గోకులాష్టమి వేడుకల్లో పాల్గొన్న గ్రామస్థులు


కాళీమందిర్‌లోని హైస్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారి









అత్తాపూర్‌లో చిన్నారులు...

ఇస్కాన్ టెంపుల్‌లో జన్మాష్టమి వేడుకలు

అత్తాపూర్: శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్తాపూర్ ఇస్కాన్ టెంపుల్‌లో ఆలయాల నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని దర్శనం చేసుకునేందుకు 50 వేల మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పూర్తిగా సహకరించినట్లు చైతన్య అవతార్ దాస్ అత్తాపూర్ ఇస్కాన్ టెంపుల్ మేనేజర్ హరిదాస్ తెలిపారు.



‘సిరిధాన్యాలతో జీవనసిరి’

- చిరుధాన్యాలతోనే ఆరోగ్యం
- దేశంలో 20–25 శాతం మందికి మధుమేహం
- పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఖాదర్ వలి


సదస్సులో మాట్లాడుతున్న పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఖాదర్‌వలి

శంషాబాద్ రూరల్: నిత్యం తీసుకునే ఆహారంలో సిరిధాన్యాలను వినియోగిస్తే ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని పద్మశ్రీ పురస్కార గ్రహీత, స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలి అన్నారు. శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ‘సిరిధాన్యాలతో జీవనసిరి’ అనే అంశంపై రైతునేస్తం ఫౌండేషన్, స్వర్ణభారత్ ట్రస్ట్ సహకారంతో కర్షక సేవా కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 150 సంవత్సరాల క్రితం మధుమేహం అంటే ఎవరికీ తెలియదని.. కానీ ఇప్పుడు దేశవ్యాప్తంగా 20–25 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని.. పుట్టే ప్రతి 100 మంది పిల్లల్లో 10–15 మంది బుద్ధిమాంద్యంతో పుడుతున్నారన్నారు. ఈ సమస్యలన్నింటికీ పోషకాలు లేని ఆహారం తీసుకోవడమే ప్రధాన కారణమన్నారు. పూర్వీకుల ఆహార అలవాట్లు అయిన చిరుధాన్యాలను పక్కకు నెట్టి ఇప్పుడు బియ్యం, గోధుమలు వంటి ఆహారధాన్యాలను వినియోగించేలా మన జీవనశైలి మారిందన్నారు. వీటి ఫలితంగానే మానవ సమాజాన్ని అనారోగ్య సమస్యలు పట్టిపీడిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ వాడకం, ప్రాసెసింగ్ ఫుడ్, జంక్ ఫుడ్ వంటి విదేశీ ఆహార అలవాట్లను అలవాటు చేసుకోవడం అనారోగ్యాలకు కారణమన్నారు. దీన్ని అధిగమించాలంటే పాలు, టీ, కాఫీ, ప్లాస్టిక్, శుద్ధి చేసిన ఆహారాలను మానేసి.. కొర్రలు, అండుకొర్రలు, ఆరికలు, సామలు, ఊదలతోపాటు కషాయాలను ఆహారంగా తీసుకుంటే ఆరు నెలల్లో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డీవీఎస్ రావు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ సరళా ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు తప్పని ట్రాఫిక్ తిప్పలు

- ట్రాఫిక్ జామ్‌తో నానా అగచాట్లు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని పోలీసులు
- డైవర్షన్‌లు, వన్‌వే, సిబ్బందిని ఏర్పాటు చేయాలి


మణికొండ పాఠశాల సర్కిల్‌లో ఏర్పడిన ట్రాఫిక్ జామ్

మణికొండ: మున్సిపాలిటీ కేంద్రంలోని పలు కూడలిల వద్ద ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. దీంతో పది నిమిషాల్లో ఇంటికి, పాఠశాలకు, ఆఫీస్‌కు చేరాల్సిన వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ గ్రామం వరకు రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధికి, పుప్పాలగూడ గ్రామం సరిహద్దు నుంచి నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లకు వస్తుంది. కొన్ని రోడ్లు, కూడలిలు అక్కడికక్కడే పోలీస్‌స్టేషన్‌లు మారుతుండటం, రెండు పోలీస్‌స్టేషన్‌లకు ట్రాఫిక్ పోలీసుల సిబ్బంది తగినంతగా లేకపోవటంతో మణికొండను నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం పోలీసులు మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి ప్రధాన రోడ్డు, నానక్‌రాంగూడ ఐటీ ప్రాంతానికే పెద్దపీట వేసి మణికొండ ప్రభుత్వ పాఠశాల సర్కిల్‌కు ఒక హోంగార్డ్, లేదంటే కానిస్టేబుల్‌ను పంపిచేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. వీఐపీ బందోబస్తు, ఇతర కార్యక్రమాలు ఉన్నపుడు ఏ ఒక్కరినీ పంపకపోవటంతో ఆ రోజు ప్రభుత్వ పాఠశాల సర్కిల్‌లో ప్రయాణికుల బాధలు వర్ణణాతీతంగా ఉంటున్నాయి. నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వారు ఆ కూడలి మాది కాదనే నెపంతో పట్టించుకోవటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ట్రాఫిక్ పోలీస్ విభాగంలోని ఉన్నతాధికారులు, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌లు స్పందించి మణికొండలో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా డైవర్షన్‌లు, వన్‌వే, ట్రాఫిక్ సిబ్బందిని, సిగ్నల్‌లను ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను దూరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.


అంజలి గార్డెన్‌లో ఏర్పడిన ట్రాఫిక్ జామ్


లాలమ్మగార్డెన్ పైప్‌లైన్ రోడ్డుపై ఏర్పడిన ట్రాఫిక్ జామ్

గణేష్ ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలి: ఇన్‌స్పెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రగతి భవన్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన గణేష్ ఉత్సవ నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని మండప నిర్వాహకులు, యువకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నరేందర్ మాట్లాడుతూ.. ప్రతి మండపం నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌లో పర్మిషన్ తీసుకోవాలని, మండపంలో ప్రతి రోజూ ఇద్దరు వాలీంటీర్లు తప్పని సరిగా ఉండేవిధంగా చూడాలని అన్నారు. మండపం ఆవరణలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని తెలిపారు. విద్యుత్ వైర్లు తెగేలా భారీ వినాయకులను తీసుకురాకుండా, మండపంలో విద్యుత్ లైన్ కట్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఊరేగింపు సమయంలో అర్ధరాత్రి వరకు డీజేలతో మోగించవద్దని తెలిపారు. నిర్ణిత సమయంలో వినాయకుడిని నిమజ్జనానికి తరలివెళ్లేలా చూడాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రతి మండప నిర్వాహకులు పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పైడినాయుడు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.